సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 28 । డిసెంబర్ । 2023



సోమశిలలో 35.284 టీఎంసీలు

సోమశిల: సోమశిలలో బుధవారం నాటికి 35.284 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2,550., ఉత్తర, దక్షిణ కాలువలకు 270 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.65,220
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,857
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,033
సవర (8 గ్రాములు)	రూ.48,264

గరిష్టం/కనిష్టం
29.5 /21.5

వాతావరణం

బుధవారం గాలిలో తేమ 60 శాతంగా ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం వాతావరణంలో పెద్దగా మార్పులేమీ ఉండవు.





క్రీడోత్సాహం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో బుధవారం నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నెల్లూరు ఏసీసుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణం, చేజర్ల జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన క్రికెట్, వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు పోటీపడి క్రీడాస్ఫూర్తిని చాటారు.

న్యూస్‌రీల్

మెనూ ప్రకారం భోజనం అందించాలి



గిరిజన పాఠశాలను తనిఖీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

నెల్లూరు (వేదాయపాళెం): వసతిగృహ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీ రాజన్నదొర సూచించారు. నగరంలోని గిరిజన బాలికల వసతిగృహం, కన్వర్టెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా..లేదా అని ఆరాతీశారు. ఆయన వెంట జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారిణి పరిమళ, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

సైబర్ ల్యాబ్ ప్రారంభం



సైబర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): జిల్లా పోలీసు కార్యాలయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సైబర్ ల్యాబ్‌ను ఎస్పీ కే తిరుమలేశ్వర రెడ్డి బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతికతను జోడించినప్పుడే సమాజంలో నేరాలను అదుపు చేయగలమన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లే కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా సిబ్బంది అందరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ప్రతిఒక్క సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందిస్తామన్నారు. నాన్‌క్యాడర్ ఎస్పీ డీ హిమవతి, డీఎస్పీలు డీ శ్రీనివాసరెడ్డి, పీ వీరాంజనేయరెడ్డి, ఎస్ కోటారెడ్డి, రమణ, శివాజీరాజ, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఎం. బాబి, పీవీ నారాయణ, వీరానాయక్, ఆర్ఐ శ్రీనివాసుల రెడ్డి, ఐటికోర్ ఎస్ఐ సురేష్, ఆర్ఎస్ఐ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాఫ్ చైర్మన్ పదవీకాలం పొడిగింపు




కొండూరు అనిల్‌బాబు

నెల్లూరు(సెంట్రల్): ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు పదవీ కాలాన్ని పొడగిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా అనిల్‌బాబు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ఇప్పటి వరకు తన శక్తి మేర కృషి చేశానని, రానున్న రోజుల్లో మరింతగా కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో తన పదవీ కాలాన్ని పొడగించడంపై ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యేలు పీ అనిల్‌కుమార్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్యకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

నేడు నామినేషన్ల స్వీకరణ

నెల్లూరు(సెంట్రల్): జిల్లా గొర్రెల ఉత్పత్తిదారుల సహకార సంఘ నూతన పాలకవర్గ ఎన్నికకు గురువారం నామినేషన్లు స్వీకరించనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయం సమీపంలోని సహకార సంఘ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జనవరి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సహకార సంఘంలో ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



తన్వి

కందుకూరు రూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు శ్రీనివాసరావు కుమార్తె మంచాల తన్వి టేబుల్ టెన్నిస్ అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలకు ఎంపికైంది. విజయవాడలోని శ్రీచైతన్య విద్యాసంస్థలో తొమ్మిదో తరగతి చదువుతున్న తన్వి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడంతో పలువురు వైద్యులు అభినందించారు.

రెవెన్యూ సమస్యలకు చెక్

ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రత్యేక కమిటీలు

- 15 రోజులకోసారి మండల స్థాయిలో సమీక్షలు
- ప్రతినెలా కలెక్టర్‌తో సమావేశమై సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి
- 30,530 నోషనల్ ఖాతాలకు చెందిన 34,071 ఎకరాలకు విముక్తి
- సాదా బైనామాలో 4,570 సమస్యలకు పరిష్కారం
- సీజేఎఫ్ఎస్ లబ్ధిదారులు 542 మందికి 1608 ఎకరాలకు పట్టాలు
- 1279 మందికి 1546 ఎకరాలకు అసైన్‌మెంట్ పట్టాలు
- 63 గ్రామాల్లో 7,132 ఎకరాల చుక్కల భూములకు విముక్తి



కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సమస్యలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి(ఫైల్)

ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రీ సర్వే ద్వారా భూసమస్యలను పరిష్కరించి శాశ్వత హక్కులను కల్పిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్య సాధనలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి భూసమస్యలకు విముక్తి కల్పిస్తూ రైతుల మోముల్లో ఆనందం నింపుతున్నారు. కలెక్టర్ ఎం హరినారాయణన్ సైతం ప్రత్యేక చొరవ చూపడంతో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఆత్మకూరు ముందు వరసలో ఉంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలపై ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. వాటి పరిష్కారానికి గ్రామ, మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ స్థాయిలో వలంటీర్లతో పాటు సచివాలయంలోనూ రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి నివేదికను రూపొందించేలా చర్యలు చేపట్టారు. అందులో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో స్థాయిలో పరిష్కారమయ్యే వాటిపై రెవెన్యూ కమిటీ సభ్యుల ద్వారా ప్రతి పదిహేను రోజులకు మండల స్థాయిలో సమీక్ష నిర్వహించి నివేదికను అందజేసేలా పర్యవేక్షిస్తున్నారు. వాటితో పాటు గ్రామాల్లో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న నోషనల్ ఖాతాలు, సాదా బైనామా, సీజేఎఫ్ఎస్ భూములతో పాటు భూ స్వభావం మార్పు, తదితర సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రతి నెలా కలెక్టర్ ఎం హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, ఆర్డీఓ మధులత, మండల తహసీల్దార్లు, రెవెన్యూ కమిటీ సభ్యులతో కలెక్టరేట్‌లో సమావేశాలు నిర్వహిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ రైతుల వద్ద శభాష్ ఎమ్మెల్యే అనిపించుకుంటున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని 63 గ్రామాల్లో ఇప్పటి వరకు 7,132.99 ఎకరాల చుక్కల భూములకు సంబంధించి పూర్తి నివేదికను రూపొందించి పరిష్కరించేందుకు సిద్ధం చేశారు. 2003 వరకు పంపిణీ చేసిన అసైన్‌మెంట్ భూములకు సంబంధించి నియోజకవర్గంలోని 2,719 మంది లబ్ధిదారులకు 4,131 ఎకరాలకు పట్టాలను మొదట విడతగా అందజేయనున్నారు. ఇంకా లబ్ధిదారులు ఉంటే రెండో విడతలో గుర్తించి అందజేసేలా అధికారులు, నాయకులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. వీటితో పాటు ఇనాం భూములు పొందిన నియోజకవర్గంలోని 52 గ్రామాల్లోని 628 మందికి 1465.17 ఎకరాల భూములపై సర్వహక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిషేధిత జాబితా నుంచి వారి సర్వే నంబర్లను తొలగించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

నోషనల్ ఖాతాల సమస్యల పరిష్కారం

మండలం	గ్రామాల సంఖ్య	ఖాతాలు	విస్తీర్ణం (ఎకరాల్లో)
అనంతసాగరం	17	6947	5347.65
ఏఎస్‌పేట	23	3176	4780.53
ఆత్మకూరు	21	9319	11667.28
చేజర్ల	11	2499	2438.78
మర్రిపాడు	20	6435	7890.985
సంగం	17	2154	1945.84

సీజేఎఫ్ఎస్‌కు డీ-ఫారం పట్టాలు

మండలం	లబ్ధిదారులు	ఎకరాలు
ఆత్మకూరు	04	6.32
అనంతసాగరం	44	37.88
ఏఎస్‌పేట	154	74.02
చేజర్ల	56	72.65
మర్రిపాడు	266	701.7
సంగం	18	12.33

సాదా బైనామాలో పరిష్కారమైన సమస్యలు

మండలం	సాదా బైనామా	ఫారం 11.12 పూర్తైనవి
అనంతసాగరం	1161	1161
ఏఎస్‌పేట	887	887
ఆత్మకూరు	682	477
చేజర్ల	157	157
సంగం	1308	1038
మర్రిపాడు	1161	1161

అసైన్‌మెంట్లకు డీ-ఫారం పట్టాలు

మండలం	లబ్ధిదారులు	విస్తీర్ణం(ఎకరాల్లో)
ఆత్మకూరు	92	134.97
అనంతసాగరం	205	214.33
ఏఎస్‌పేట	321	140.04
చేజర్ల	370	526.17
మర్రిపాడు	99	258.60
సంగం	192	272.27

పోరంబోకు భూములు అనాధీనంగా మార్పు

ఎన్నో ఏళ్లుగా సంగంలోని రెవెన్యూ రికార్డుల్లో కొండ పోరంబోకుగా ఉన్న భూమిని అనాధీనంగా మార్పు చేసేలా ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించి ప్రత్యేక గెజిట్ ఉత్తర్వులు ఇచ్చేలా కృషి చేశారు. అడంగళ్‌లో రహదారి పోరంబోకుగా ఉన్న భూమి స్వభావాన్ని నివాస యోగ్య స్థలంగా మార్పు చేసేలా ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఏఎస్‌పేట మండలంలోని రాజవోలులో డొంక పోరంబోకుగా ఉన్న గ్రామ కంఠం భూమిని మార్పు కోసం ఉన్నతాధికారులకు నివేదిక సిద్ధం చేశారు.

ఆనందంగా కుటుంబం



40 ఏళ్ల క్రితం మా పెద్దలకు మంజూరు చేసిన డీఫారం పట్టా భూమిని వారసత్వంగా సాగు చేసుకుంటున్నాం. కుటుంబ అవసరాలకు భూమిని అమ్మాల్సి వచ్చినప్పుడు రిజిస్ట్రేషన్ అవక నిస్సహాయంగా ఉండాల్సి వచ్చింది. ఇటీవల మా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆధారంగా రెవెన్యూ అధికారులు మా ఇంటికి వచ్చి సంపూర్ణ భూహక్కు పత్రాలను అందజేశారు. దీంతో మా కుటుంబం అంతా సంతోషంగా ఉంది.

–షేక్ ఖాజమ్మ, మహిళా రైతు, డీసీపల్లి, మర్రిపాడు మండలం

ఐదు దశాబ్దాల సమస్య పరిష్కారం



ఐదు దశాబ్దాల క్రితం మహిమలూరులోని సర్వే నంబరు 578లోని 6.56 ఎకరాల మెట్ట భూమిని మా పూర్వీకుల హయాం నుంచి సాగు చేసుకుంటున్నాం. చుక్కల భూమిగా రికార్డుల్లో నమోదవడంతో మా కుటుంబం యావత్తు ఇబ్బందులు పడింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇటీవల నిషేధిత భూముల జాబితా నుంచి మా వారసత్వ భూమిని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో నాతో పాటు సోదరులైన నారాయణ, శ్రీనివాసులు, పెంచలయ్య, పెంచల నరసింహుల కుటుంబాలు సమగ్ర భూహక్కులు పొంది సంతోషంగా ఉన్నాం. జగనన్న ప్రభుత్వానికి మా కుటుంబం యావత్తు రుణపడి ఉంటుంది.

–విడవలూరు వెంకటేశ్వర్లు, రైతు, మహిమలూరు, ఆత్మకూరు మండలం

ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం

ఆత్మకూరు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం. సమీక్షల నివేదికను సిద్ధం చేసుకుంటూ తర్వాత సమీక్షలో పురోగతిని ఆరా తీస్తున్నాం. పూర్తి స్థాయిలో సమస్యల పరిష్కారంపై నిరంతరం దృష్టి సారిస్తున్నాం. మండల తహసీల్దార్లకు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పూర్తి నివేదికను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించాం.

– రోణంకి కూర్మనాథ్, జాయింట్ కలెక్టర్

కష్టపడి చదివితేనే లక్ష్యం చేరువ

- జెడ్పీ సీఈఓ చిరంజీవి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

నెల్లూరు (వేదాయపాళెం): కష్టపడి చదివితేనే లక్ష్యం చేరువవుతుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పోటీ పరీక్షల ఉచిత శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1,2 ప్రిలిమినరీ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణా కాలంలో అభ్యర్థులకు స్టైఫండ్, స్టడీ మెటీరియల్, బుక్‌అలెవెన్స్‌లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సమయం తక్కువ ఉన్నందున అభ్యర్థులు అకడమిక్ బుక్స్‌తో పాటు మంచి పుస్తకాలను ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 119 మంది ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోగా, 80 మందిని శిక్షణకు ఎంపిక చేశామని తెలిపారు. నెల్లూరు సహాయ బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీప్రసూన, కుట్టి కోచింగ్ నిర్వాహకులు లతీఫ్ కుట్టి, వీఎస్‌యూ ప్రొఫెసర్ వీరారెడ్డి, చెంచురామయ్య, శ్రీనివాసులు, ఆర్కే నాయుడు, మహేష్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 18 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

నెల్లూరురూరల్: ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 5 నుంచి పరీక్షల ఫీజును చెల్లించవచ్చునని చెప్పారు. జనవరి 19వ తేదీతో పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పూర్తవుతుందని చెప్పారు. తదుపరి అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

శిలాఫలకాలే అభివృద్ధా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- తుఫాన్ సాయంపైనా పిల్లిమొగ్గలు
- కిరాయి సోమిరెడ్డి చెప్పేవి పచ్చి అబద్ధాలు
- సాక్ష్యాధారాలతో బయటపెట్టిన మంత్రి కాకాణి

మనుబోలు: ఎన్నికల సమయంలో కేవలం శిలాఫలకాలు వేసి వదిలేసి దాన్నే అభివృద్ధి అంటూ సోమిరెడ్డి ప్రచారం చేసుకుంటున్నాడని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మనుబోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల వర్షాలకు ముందు మండలంలోని రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతుండగా తాము ఎలా ఇవ్వాలని ఆలోచన చేస్తున్న సమయంలో టీడీపీ నాయకులు, సోమిరెడ్డి దీక్షలు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. తాము సకాలంలో నీళ్లు విడుదల చేయడంతో ఆయనకు నాలుగు రోజులు నిద్ర పట్టలేదని ఎద్దేవా చేశారు. సైదాపురం మైన్లపై ఉద్యమం అంటూ హడావుడి చేసి 14 వాటాల కమీషన్‌ను తీసుకుని అటకెక్కించిన విషయం వాస్తవమా.. కాదా.. అని ప్రశ్నించారు. గతంలో సోమిరెడ్డి మంత్రిగా బండేపల్లి కాలువ ద్వారా నీరు ఇస్తామని చెప్పి రూ.60 లక్షల బిల్లులు చేసుకుని స్వాహా చేశాడని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తుఫాన్ బాధితులకు భారీగా సాయం అందించినట్లు సోమిరెడ్డి చెబుతున్నవి కట్టుకథలన్నారు. 2017 తుఫాన్ సమయంలో నియోజకవర్గంలో కేవలం సర్వస్వం కోల్పోయిన 600 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, ఉపాధి కోల్పోయిన 2,500 కుటుంబాలకు 10 కేజీల బియ్యం ఇచ్చారని ఆనాటి జీఓను చూపుతూ స్పష్టం చేశారు. గత ప్రభుత్వానికంటే ఎన్నోరెట్లు మిన్నగా తాము 18 వేల కుటుంబాలకు రూ.2,500 నగదు, 25 కేజీల బియ్యం, నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు అందజేశామని తెలిపారు. ఎంపీపీ వజ్రమ్మ, వైఎస్ఎంపీపీ వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియను సమన్వయంతో నిర్వహించాలి

- జనవరి 12లోగా క్లెయిమ్‌ల పరిశీలనను పూర్తి చేయాలి
- కలెక్టర్ ఎం హరినారాయణన్



డీకేడబ్ల్యూ కళాశాలలో భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రక్రియను ఈఆర్వోలు, పోలీసులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జేసీ కూర్మనాథ్, ఈఆర్వోలు, పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. 2024లో పార్లమెంట్, శాసన సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల లొకేషన్, రూట్ మ్యాపింగ్ ప్రక్రియ, తదితర అంశాలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈఆర్వోలు, పోలీసు అధికారులు సమన్వయంతో రూట్ మ్యాపింగ్ ప్రక్రియతో పాటు ఎన్నికల ప్రక్రియను చేపట్టాలన్నారు. జిల్లాలోని పెండింగ్ క్లెయిమ్స్, అభ్యంతరాలను జనవరి 12వ తేదీలోగా పరిష్కరించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని తెలిపారు. బీఎల్వోల సమన్వయంతో నిర్దేశించిన గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని ఈఆర్వోలను ఆదేశించారు.

స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలకు భవనాల పరిశీలన

2024లో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి, జేసీ కూర్మనాథ్, ఈఆర్వోలతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లకు అవసరమైన భవనాలను బుధవారం పరిశీలించారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల, డీకేడబ్ల్యూ కళాశాలను సందర్శించి భవనాలను పరిశీలించారు. ఈ సమావేశంలో ఈఆర్వోలు నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్, కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి, నుడా వీసీ బాపిరెడ్డి, నెల్లూరు, ఆత్మకూరు ఆర్డీఓలు మలోల, మధులత, తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ ఓబులేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రేమ్‌కుమార్, కావలి ఏఈ ఆర్వో మాధవరెడ్డి, డీఎస్పీలు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితాల తయారీ

పారదర్శకంగా స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో ఓటరు జాబితా పునశ్చరణ, ఎన్నికలకు సంబంధించిన అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023 అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9 వరకు స్వీకరించిన అభ్యంతరాలను జనవరి 12వ తేదీ నాటికి పరిష్కరించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేలా కృషి చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లను పూర్తి స్థాయిలో నియమించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై రాజకీయ పక్షాల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆడుదాం ఉల్లాసంగా.. ఉత్సాహంగా

క్రీడోత్సాహం ఉప్పొంగింది. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా జిల్లా వ్యాప్తంగా క్రీడా పోటీలు జరుగుతున్నాయి. బుధవారం వివిధ పోటీలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించగా క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


కొడవలూరు: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి


నెల్లూరు: క్రికెట్ మ్యాచ్ ప్రారంభం సందర్భంగా బ్యాటింగ్ చేస్తున్న మేయర్ స్రవంతి


వెంకటాచలం: క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు


ఆత్మకూరు : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

• కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తన చాంబర్‌లో బుధవారం విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతిలో సిలబస్ రివిజన్‌పై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సమ్మేటివ్ అసెస్మెంట్‌లో పాస్ మార్కులు పొందని వారిపై శ్రద్ధ పెట్టి ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని సూచించారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు చేపట్టి జిల్లాను ముందంజలో నిలపాలని తెలిపారు. నాడు – నేడు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలు వినియోగించే ట్యాబ్‌లు పని చేయకపోతే వెంటనే స్పందించాలన్నారు. ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేస్తున్న ఐఎఫ్‌పీలు, డిజిటల్ టీవీల కోసం ఇంటర్నెట్ కనెక్షన్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో డీఈఓ గంగా భవానీ, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, నెల్లూరు డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీఎంపీ వ్యవస్థాపక దినోత్సవం


మాట్లాడుతున్న వేణుగోపాల్

నెల్లూరు సిటీ: కమ్యూనిటీ పారామెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 61వ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం నెల్లూరులోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు పీఎంపీలు వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. నూతన విధానాలపై అవగాహన పెంపొందించుకుని ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించాలన్నారు. 61 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నారాయణ మెడికల్ గ్రూప్ ఇన్‌స్టిట్యూట్ ఏజీఎం భాస్కర్‌రెడ్డి, అర్థోపెడిక్ వైద్యులు పోలుబోయిన అశ్విని కుమార్, డాక్టర్‌లు చైతన్యకుమార్‌రెడ్డి, వినీలరెడ్డి, చిరంజీవి, శ్రీలతరెడ్డి, అనుముల జయప్రకాష్, న్యాయ సలహాదారు రమాదేవీ తదితరులు పాల్గొన్నారు.

పశువుల దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల పశువులు, గొర్రెలు, మేకలను దొంగిలించిన నలుగురు వ్యక్తులను సీసీఎస్, బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ హైమారావు, ఎస్సై మహేంద్ర తెలిపారు.

వరద బాధితులకు అండగా నిలిచాం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్

• నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వరదల సమయంలో బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలిచాం. ప్రస్తుత టీడీపీ నాయకులు మాత్రం వరదల్లో సేవ చేశామని గొప్పలు చెప్పుకొంటున్నారు. అయితే వారు ఏ ఒక్క ప్రాంతానికైనా వెళ్లి పరామర్శించారా?' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ కుమార్ ప్రశ్నించారు. నెల్లూరు నగరంలోని 9వ డివిజన్ దళితవాడ, నజీర్‌తోట, ఎఫ్‌సీఐ కాలనీ ప్రాంతాలకు సంబంధించి రూ.90 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి అనిల్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితవాడకు సంబంధించి మరో రూ.50 లక్షలతో వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. నూతనంగా అభివృద్ధి అయిన స్థానిక ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణానికి టెండర్లు పిలిచామన్నారు. నెల్లూరు సిటీలో ఓ వైపు నారాయణ తిరుగుతుంటే.. మరోవైపు టీడీపీ నాయకులతో జనసేన నాయకుడు మనుక్రాంత్‌రెడ్డి తిరుగుతుండడం వింతగా ఉందన్నారు. ఇంతకూ నగర నియోజకవర్గానికి అభ్యర్థి ఎవరో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో ఎవరికి వారు విడివిడిగా ప్రచారం చేస్తుండడాన్ని చూస్తుంటే వారిద్దరిలో ఏ ఒక్కరికి టికెట్ ఇచ్చినా మరొకరు కనిపించే పరిస్థితి ఉండదన్నారు. తమ పార్టీపై, తనపై రోజూ విమర్శలు చేస్తున్న వారిద్దరిలో ఎవరికి టికెట్ ఇవ్వకపోయినా ప్రజల్లోనే ఉంటామని ప్రమాణం చేయగలరా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్, భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ వంగాల శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పచ్చపత్రికలు దిగజారుడు రాతలు మానాలి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కొడవలూరు: 'మండలంలో మంగళవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజానీకం బ్రహ్మరథం పట్టారు. జనంతో నార్తురాజుపాళెం కిక్కిరిసిపోతే.. పార్కింగ్ స్థలాల్లో జనం లేని చోట ఫొటోలు తీసి యాత్రలో జనం లేరని రాయడం పచ్చపత్రికలకే సాధ్యమైంది. వారు దిగజారుడు రాతలు మానుకోవాలి.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. నార్తురాజుపాళెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాత్ర సువర్ణాక్షరాలతో చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, నల్లపరెడ్డి అభిమానులు, ప్రత్యేకించి 15 రోజులుగా కష్టపడి యాత్ర విజయవంతానికి శ్రమించిన డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఎక్కడా కూడా చిన్నపాటి సంఘటన చోటుచేసుకోకుండా యాత్రను విజయవంతం చేయడం చలపతిరావుకే దక్కిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాలని కోరుతూ జనవరి 20న నార్తురాజుపాళెంలోని శ్రీనారికేళ సహిత రసలింగేశ్వర (పాదరసం) మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. లక్ష కొబ్బరికాయలు, లక్ష రుద్రాక్షలు, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చనతో పాటు 40 మంది వేద పండితులతో సుదర్శన యాగం చేయిస్తున్నానన్నారు. పేదలకు అండగా ఉన్న జగనన్న ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకొంటున్నారని, అందువల్లే ఆ యాగం తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, నల్లపరెడ్డి అభిమానులు, ప్రజలను భాగస్వాములను చేస్తామన్నారు. వీరి చలపతిరావు మాట్లాడుతూ సాధికార యాత్రకు భారీగా జనం తరలివచ్చారన్నారు. సమావేశంలో ఏపీఎస్‌డీఏ చైర్మన్ జి.విజయకుమార్, డీఏఏబీ, ఏఎంసీ చైర్మన్లు డి.నిరంజన్‌బాబురెడ్డి, పి.రాధాకృష్ణారెడ్డి, సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌లు జి.వెంకటశేషయ్య, ఎన్.సుబ్బారెడ్డి, సీహెచ్ సతీష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. మొత్తం 426 మంది విద్యార్థులకు గానూ 382 మంది హాజరయ్యారని వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.21
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	105
లేయర్ (లైవ్) :	90
బ్రాయిలర్ చికెన్ :	190
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	210
లేయర్ చికెన్ :	153

సీఎం వైఎస్ జగన్ పేదల పక్షపాతి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని రెండో వార్డులో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల వివరాలు తెలియజేసే బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజలకు సీఎం ఎంతో మేలు చేశారని చెప్పారు. జనవరి 3వ తేదీ తర్వాత బాలింతలకు జగనన్న కిట్లు అందించాలని, ఇందుకు సహకరించాలని అంగన్‌వాడీలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. వారి సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. 175 చోట్ల అభ్యర్థులను నిలపలేని స్థితిలో చంద్రబాబు ఉన్నాడన్నారు. పవన్ కళ్యాణ్‌తో జత కలిసినా కూడా అభ్యర్థులను ప్రకటించలేని స్థితిలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రం సంగతి దేవుడెరుగు, కనీసం కుప్పం నియోజకవర్గాన్నైనా కాపాడుకోవాలనే తాపత్రయంలో బాబు ఉన్నాడన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా పనిచేసి కూడా ఆ నియోజకవర్గానికి కనీసం తాగునీరు అందించలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డీసీసీబీకి రాష్ట్రస్థాయిలో గుర్తింపు

• సీఎం సహకారంతో నష్టాల నుంచి లాభాలబాటలో..
• చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)కి రాష్ట్రస్థాయిలో గుర్తింపు దక్కిందని చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న ఆ బ్యాంక్ ప్రధాన పరిపాలనా కార్యాలయంలో బుధవారం మహాజన సభను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కామిరెడ్డి మాట్లాడుతూ 2021 సంవత్సరంలో రూ.700 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించిన బ్యాంక్ 2023 నాటికి రూ.2 వేల కోట్ల లావాదేవీలు పూర్తి చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ హయాంలో రూ.30 కోట్ల షేర్ క్యాపిటల్ ఇవ్వడంతో బ్యాంక్ నిలబడిందన్నారు. తండ్రి కంటే అదనంగా నేటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.40 కోట్లు షేర్ క్యాపిటల్ ఇవ్వడం జరిగిందన్నారు. వారిద్దరి సహకారంతోనే డీసీసీబీ పూర్వ వైభవం సాధించిందన్నారు. అవినీతికి తావులేకుండా పనిచేస్తూ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి చెడ్డపేరు తీసుకురాకుండా బ్యాంక్ కార్యకలాపాలు సాగుతున్నాయన్నారు. జిల్లా రైతులకు అన్ని రకాల రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. రుణాల మంజూరులో ఆలస్యం జరిగితే ఫిర్యాదు చేయొచ్చన్నారు. కొందరు సొసైటీ సీఈఓల నిర్వాకం వల్ల రైతులు, సొసైటీ అధ్యక్షులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికి వేతనాన్ని నిలుపుదల చేసే అధికారం అధ్యక్షులకు ఉందని గుర్తుచేశారు. నెల్లూరు డీసీసీబీ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అందిస్తున్న సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈఓ వై.సరిత, డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, బ్యాంక్ డిప్యూటీ రిజిస్ట్రార్ అంజిరెడ్డి, డీజీఎంలు దయాకర్‌రెడ్డి, ఉషారాణి, నాగేంద్రకుమారి, పలు సొసైటీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి


విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేద పిల్లలకు అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు – నేడు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. దీంతో ప్రతి ఏడాది విద్యార్థుల నమోదు శాతం పెరిగిపోతోందన్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద తదితర పథకాలు పేద పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నట్లు చెప్పారు. ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.సామ్రాజ్యం, నియోజకవర్గ యువ నాయకుడు మేకపాటి అభినవ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎం బాలకేశవులు, ఉప సర్పంచ్ ముర్తుజా హుస్సేన్ పాల్గొన్నారు.